ఇసుక
అక్రమ రవాణా చేస్తే చర్యలు

• ఎస్పీ యోగేశ్‌గౌతమ్

నారాయణపేట, ఫిబ్రవరి 11: జిల్లాలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే పీడీపీపీ యాక్ట్, మైన్స్ యాక్ట్ కింద కేసులు పెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు ప్రజలు డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం కేటాయించిన ఇసుక రీచ్‌లు, స్టాక్ పాయింట్ల వద్ద భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి పొందిన వారికి మాత్రమే ఇసుక తరలింపు, విక్రయించేందుకు అనుమతి ఉందని పేర్కొన్నారు. ఇసుక సబ్ కాంట్రాక్టర్స్, ఇతర పేర్లతో లావాదేవీలు జరిపిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కందులు@రూ.8వేలు

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 11: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం 54 క్వింటాళ్ల తెల్లకందులు విక్రయానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.8వేలు, కనిష్ఠంగా రూ.6,212 ధర పలికాయి. 122 క్వింటాళ్ల ఎర్రకందులు విక్రయానికి రాగా.. క్వింటాకు గరిష్ఠంగా రూ.7,750, కనిష్ఠంగా రూ.6,222 ధర పలికాయి. 520 క్వింటాళ్ల వేరుశనగ విక్రయానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.6,269, కనిష్ఠంగా రూ.3,869 ధర పలికినట్లు యార్డు సూపర్‌వైజర్ లక్ష్మణ్ తెలిపారు.

రిజర్వేషన్ కల్పించాలి

భూత్పూర్, ఫిబ్రవరి 11 : మండలంలోని వెల్కిచర్ల గ్రామానికి చెందిన దళిత సంఘం నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు యాదయ్య మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78ఏండ్లు పూర్తయినా ఇంత వరకు వెల్కిచర్ల గ్రామం ఎస్సీ రిజర్వేషన్‌కు నోచుకోలేదన్నారు. ఈసారి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

జవాబులు
పునశ్చరణ చేసుకోవాలి

మక్తల్, ఫిబ్రవరి 11 : పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థి జవాబును పునశ్చరణ చేసుకుంటే పరీక్షల్లో అనుకున్న స్థాయిలో ఫలితాలను సాధించొచ్చని ఎంఈవో అనిల్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని జక్లేర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలంగాణ విద్యాశాఖ టీ షాట్ ద్వారా విద్యార్థులకు స్క్రీన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వాలీబాల్ ఆల్
ఇండియా పోటీకి ఎంపిక

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 11 : తమిళనాడులోని చెన్నైలో ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఆల్ ఇండి యా సివిల్ సర్వీస్ ఉమెన్స్ వాలీబాల్ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ బాలికల మార్కెట్‌రోడ్డు హైస్కూల్ పీఈటీ గీతా ఎంపికైంది. ఈ సందర్భంగా మంగళవారం డీవైఎస్‌వో శ్రీనివాస్, క్రీడా సంఘాల నాయకులు, అధ్యాపకులు అభినందించారు.

విత్తనాల పంపిణీ

హన్వాడ, ఫిబ్రవరి 11 : మండలంలోని యారోన్‌పల్లిలో మంగళవారం ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 14 రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసీఐసీఐ ఫౌండేషన్ ఫీల్డ్ అధికారి మాట్లాడుతూ రైతులు ఫౌండేషన్ తరపున పంపిణీ చేసిన కూరగాయల విత్తనాలను పండించి అధిక దిగుబడులను పొందాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాథోడ్ పాల్గొన్నారు.

ముగ్గురికి జైలు శిక్ష

హన్వాడ, ఫిబ్రవరి 11 : డ్రంకన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష పడినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టులో బుద్ధారానికి చెందిన రామాంజనేయులుకు 2రోజులు జైలు శిక్ష రూ.3వేలు జరిమానా, హన్వాడకు చెందిన దత్తాత్రేయ జైలు శిక్ష, రూ.3వేలు జరిమానా, కుల్కచర్లకు చెందిన ప్రశాంత్‌కు జైలు శిక్ష రూ.2వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, M.A Khaliq S/o Late. M.A Quddus, aged 38 years, Occ: Business, R/o H.No.2-8-24, Market road, Mahabubnagar Dist., **Applicant / Borrower** నా క్లైంట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, జడ్చర్ల బ్రాంచ్ గారికి ఇట్టి ఆస్తిని తనఖా (Mortgage) పెట్టి అప్పు తీసుకోవటానికి దరఖాస్తు చేసియున్నారు. ఇట్టి ఆస్తి విషయములో ఎవరికైనా ఎలాంటి హక్కుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల ఈ క్రింది అడ్రస్సుకు (3) రోజుల లోపల తెలియ జేయగలరు. లేని పక్షంలో ఇట్టి ఆస్తిపై ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి నా క్లైంట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, జడ్చర్ల బ్రాంచ్ వారు షెడ్యూల్ ఆస్తిని తనఖా పెట్టుకొని అప్పును మంజూరు చేయుదురు. తరువాత వచ్చిన ఆక్షేపణలు చెల్లనేరవు.

SCHEDULE OF THE PROPERTY:
All that the part & Parcel of Residential House bearing No.32, an extent of 150 Sq. yards, in Sy.no.337/3 situated within the limits of Bhoothpur Village & Mandal, Mahabubnagar Dist.,
Bounded by: East : Plot no.31, **West:** Plot no.33, **North:**25 ft road, **South:** Plot no.14.
Schedule 2:
All that the part & Parcel of Residential House bearing No.33, an extent of 150 Sq. yards, in Sy.no.337/3 situated within the limits of Bhoothpur Village & Mandal, Mahabubnagar Dist.,
East : Plot no.32, **West:** Plot no.34, **North:**25 ft road, **South:** Plot no.13,

K. CHANDRA MOULI, B.Com., LLB
Advocate, New Gunj, Hanuman Nagar, Mahabubnagar. Cell: 9440330760

మహబూబ్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు
సిద్ధం కావాలి

• కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 11 : గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో హన్వాడ, గండీడ్, సీసీ కుంట, మూసాపేట, కోయిలకొండ, నవాబ్‌పేట, కౌకుంట్ల, మహమ్మదాబాద్ మండలాలకు సంబంధించి గ్రామ పంచాయతీ ఎన్నికలకు నియమించిన స్టేజ్ 1 ఆర్‌వో, ఏఆర్‌వో స్టేట్2 ఆర్‌వోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తూచ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. ఎన్నికల కమిషన్ ప్రకటన అనుసరిస్తూ నోటిఫికేషన్ జారీ నామినేషన్ ప్రక్రియ నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీపీఆర్‌వో పార్థసారథి, సీఎంవో బాలుయాదవ్ పాల్గొన్నారు.

మండల స్థాయిలో శిక్షణ నిర్వహించాలి

పాలమూరు, ఫిబ్రవరి 11 : జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు మాస్టర్ ట్రైనర్లుగా నియమించిన వారు ఎన్నికల సిబ్బందికి ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు, మండల స్థాయి ట్రైనర్లకు జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారులను, ఆర్‌వోఏఆర్‌లను నియమించినట్లు, అలాగే గ్రామ పంచాయతీ ఎన్నికలకు నిర్వహణ నోడల్ అధికారులను, స్టేజ్1, ఆర్‌వోఏఆర్‌వో స్టేజ్ 2 ఆర్‌వోలను నియమించినట్లు తెలిపారు. ఈ ఎన్నికల శిక్షణ కార్యక్రమాలు ఈనెల 15లోగా పూర్తి చేయాలన్నారు. మండల స్థాయి ట్రైనర్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ సిబ్బందికి మండల స్థాయిలో శిక్షణ నిర్వహించాలని చెప్పారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలను మంగళవారం కలెక్టర్ విజయేందిర బోయి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలకేంద్రంలో బాల, బాలికలకు నిర్వహిస్తున్న కోర్సుల శిక్షణను గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం బాల కేంద్రంలో డ్రాయింగ్‌లో శిక్షణ నిర్వహిస్తున్నట్లు అక్కడి నిర్వాహకులు కలెక్టర్‌కు తెలిపారు. ఆయా కోర్సుల్లో 65మంది శిక్షణ పొందుతున్నట్లు కలెక్టర్‌కు అధ్యాపకులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జెడ్పీ సీఈవో వెంకటరెడ్డి, డీఈవో ప్రవీణ్‌కుమార్, కేజీబీవీ ఏఎంవో శ్రీనివాస్, అధ్యాపకులు రాజేశ్‌కన్నా, ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల డోలు శిక్షకులు నాగార్జున పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆర్థిక కష్టాలు

• పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

తాసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే

మరికల్/ధన్వాడ, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో ఆర్థిక కష్టలున్నా.. ప్రజలకిచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మరికల్, ధన్వాడ మండల కేంద్రాల్లో కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్నమన్నారు.

బ్యానర్ చిన్నగా ఉందని..

రైతువేదిక వద్ద ఎమ్మెల్యే బ్యానర్ చిన్నది కట్టారని ఎమ్మెల్యే ఎదుట కార్యకర్తలు తాసీల్దార్‌ను నిలదీశారు. అలాగే ప్రొటోకాల్ పాటించడం లేదని, ఎమ్మెల్యే వస్తే రోడ్డుపై సున్నం వేయలేదని కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ప్రతిపక్ష పార్టీలకు ఇచ్చే గౌరవం అధికార పార్టీ నాయకులకు ఇవ్వడలేదని పేర్కొన్నారు. ధన్వాడలో కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులు కార్యకర్తలకు గౌరవం ఇవ్వకుంటే బాగోదని, బ్యానర్ చిన్నదిగా కట్టడానికి ఆర్థిక సమస్య ఉంటే క్యాంప్ కార్యాలయం నుంచి పెద్ద బ్యానర్ పంపిస్తామన్నారు. మరోసారి ఇలాంటివి జరుగకుండా చూడాలని, ఇష్టం లేకపోతే మరో చోటుకు వెళ్లాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి తాసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మరికల్, ధన్వాడ తాసీల్దార్‌లు అనిల్‌కుమార్, సింధుజా పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

కృష్ణ, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 75 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అమరవీరుల
కుటుంబాలను ఆదుకోవాలి

మహబూబ్‌నగర్‌అర్బన్, ఫిబ్రవరి 11 : ఎస్సీ వర్గీకరణ కోసం అలు పెరగని పోరాటం చేసి అసువులు బాసిన మాదిగ అమరవీరుల కుటుంబాలను, మాదిగ ఉద్యమకారులను తెలంగాణ ప్రభుత్వమే ఆదుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో మాదిగ వర్గీకరణకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ఎంతో మంది మాదిగలు అమరులైయ్యారని వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, సురేశ్ పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలోని ఎన్‌ఎస్ కాలనీలో మంగళవారం జేకే ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్గత రోడ్డుకు మరమ్మతులు చేయించారు. కాలనీవాసుల కోరిక మేరకు ట్రస్ట్ చైర్మన్ నర్సింహాచారి సొంత నిధులతో రోడ్డుకు మొరం వేయించి మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌చారి, అంజయ్య, నిరంజన్, శేఖర్‌రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతులు చేయించిన రోడ్డు

నిధులను సక్రమంగా వినియోగించుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 11 : పీఎంశ్రీ కార్యక్రమం ద్వారా కేంద్రం విడుదల చేసిన నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పీఎంశ్రీ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పీఎంశ్రీ కార్యక్రమానికిగాను జిల్లాలో మొదటి విడుతగా 12, రెండో విడుతగా 7 పాఠశాలలు ఎంపికయ్యాయన్నారు. కేంద్రం విడుదల చేసిన నిధులను సకాలంలో ఖర్చు చేయాలన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న కారణంగా అన్ని సబ్జెక్టులలో ప్రతివిద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా సబ్జెక్ట్ టీచర్ కృషి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులు ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులతో సమీక్షించాలని డీఈవోను ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారంలో నాణ్యత పాటించాలన్నారు.

మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ అందించాలి

ఎన్నికల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లతో పోలింగ్ నిర్వహణపై శిక్షణ ఇప్పించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పోలింగ్ సిబ్బందికి మొదటి విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ హాజరై ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. ఆయా సమావేశాల్లో డీఈవో గోవిందరాజులు, జెడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి, డీపీవో కృష్ణ పాల్గొన్నారు.

భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలి

• మన్యంకొండ జాతరలో భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 11: మన్యంకొండ బ్రహ్మోత్సవాల సందర్భంగా దైవదర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా చేసుకునేలా పోలీసులు తమ విధులు నిర్వహించాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి అన్నారు. మంగళవారం మన్యంకొండ బ్రహ్మోత్సవాలపై బందోబస్తు విధులకు వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతరకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులేకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. భక్తులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, దొంగతనాలు జరగకుండా నిఘా ఉంచి ప్రతిఒక్కరినీ గమనించాలని సూచించారు. పోలీసు బందోబస్తు ఆలయ ప్రాంగణం, భక్తుల ప్రవేశ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయానికి సమీపంలో ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు కేటాయించారు. మహిళ భక్తుల భద్రతా కోసం మహిళా పోలీసులను ప్రత్యేకంగా నియమించారు. జాతర నిర్వహణను శాంతియుతంగా పూర్తి చేసేందుకు 400 మందిని బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ రాములు, ఏఆర్ ఏఎస్పీ సురేందర్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, గిరిబాబు, రమణారెడ్డి, సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

• ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు, ఫిబ్రవరి 11 : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నా రు. మంగళవారం ఐడీబీఐ బ్యాంకు ఆధ్వర్యంలో రూరల్ మండలం బొక్కలోనిపల్లి మండల ప్రాథమిక కొన్నత పాఠశాల విద్యార్థులకు డ్యుయల్ డెస్క్ బెంచీలు, కుర్చీలు, ర్యాక్‌లు, కంప్యూటర్లను ఆయన ప్రారంభించారు. అలాగే గ్రామాలకు మహర్దశ ప్రారంభమైందని ఎమ్మెల్యే యెన్నం అన్నారు. మంగళవారం రూరల్ మండలం ఫత్తేపూర్ నుంచి భవానీతండా వరకు రూ.కోటి 75లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న నాలుగు సంవత్సరాల్లో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, రాఘవేందర్, మోహన్ రెడ్డి, చందర్, విష్ణు పాల్గొన్నారు.

ఇంటర్నెట్
నిత్యావసరంలో భాగం

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 11: ఇంటర్నెట్ నిత్యావసరంలో భాగమైందని ట్రైనీ కలెక్టర్ గరిమనరుల అన్నారు. మంగళవారం సేఫర్ ఇంటర్నెట్ డే సందర్భంగా పట్టణంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచంలో నెట్ సేవలు నిలిచిపోతే స్టాక్ మార్కెట్, సోషల్ మీడియా, ఇతర సేవలకు అంతరాయం కలుగుతుందన్నారు. మొబైల్ చేతిలో ఉంటే అన్ని రకాల సేవలు మనకు అందుబాటులో ఉన్నట్లేనన్నారు. ప్రతి మనిషి జీవితంలో గోప్యత ఎంతో అవసరమని, కాబటి ఆన్‌లైన్ ఖాతాకు యూజర్ నేమ్, పాస్‌వర్డ్ తప్పనిసరిగ్గా ఉంచాలన్నారు. చాలా మంది యూజర్లు సులువుగా గుర్తించుకునేందు కు పేరు, పుట్టినతేది అంకెలను పాస్వర్డ్‌గా ఉంచుకుంటారని, వాటిని బ్రేక్ చేయడం సైబర్ నేరగాళ్ల కు సులువు అవుతుందన్నారు. సమావేశంలో ఏ వో జయసుధ, మీసేవా, ఎన్ఐసీ సిబ్బంది ఉన్నారు.

కేసును ఎత్తివేయాలి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 11 : ప్రత్యేక రాష్ట్రం కోసం సాగిన మలిదశ ఉద్యమంలో సకల జనుల సమ్మె కాలంలో నమోదైన కేసును ఎత్తివేయాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి చంద్రానాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని టుటౌన్ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏజాజ్, ఉద్యమకారులతో కేసు విషయమై చర్చించారు. కార్యక్రమంలో ఉద్యమకారులు రాజా సింహుడు, బాలరాజు, రియాజ్ ఉద్దీన్, ఎస్సై విజయ భాస్కర్ పాల్గొన్నారు.

సీఐతో మాట్లాడుతున్న ఉద్యమకారులు

గ్రామాల్లో సెక్షన్ ఆఫీసర్ల పర్యటన

పోల్కంపల్లిలో పర్యటిస్తున్న శిక్షణ సెక్షన్ ఆఫీసర్లు

మూసాపేట(అడ్డాకుల), ఫిబ్రవరి 11 : అడ్డాకుల, మూసాపేట మండలాల్లో మంగళవారం శిక్షణ సెక్షన్ ఆఫీసర్లు పర్యటించారు. హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ తెలంగాణలో శిక్షణ పొందుతున్న సెక్షన్ ఆఫీసర్లు జిల్లా పర్యటనకు వచ్చారు. అందులో భాగంగా ఓ బృందం సభ్యులు అడ్డాకుల మండలం కందూరులో శిక్షణ సెక్షన్ ఆఫీసర్లు అంకిత్ వర్మ, మదన్‌గోపాల్ భారతి, దీపక్ వర్మ, ఆశిష్ ద్రాలీ, మరో బృందం సభ్యులు మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామంలో శిక్షణ సెక్షన్ ఆఫీసర్లు అమిత్ వర్మ, సోనికు మారి, మీనా కుమారి, మోనికాలు పర్యటించారు. ఈ సందర్భంగా వారు గ్రామాల్లో పర్యటిస్తూ వన నర్సరీలను, పాఠశాలలను, అంగ్‌వాడీ కేంద్రాలను, గ్రామ పంచాయతీని, ఉపాధి హామీ పనులు, పింఛన్ల పంపిణీ పరిశీలించి, వాటిపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీవో పులేందర్, ఏపీఎం వెంకట్‌చారి, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేందర్‌గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

మహ్మదాబాద్, ఫిబ్రవరి 11 : బట్టలు ఉతకాడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని గాధిర్యాల్‌లో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం మేరకు వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం పులుమామిడి గ్రామానికి చెందిన గణేశ్(22) గాధిర్యాల్‌లో బంధువుల ఇంటి వద్ద ఓ శుభకార్యానికి హాజరై మంగళవారం బంధువులతో కలిసి చెరువులో బట్టలు ఉతకాడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులోకి జారి పోయి నీటిలో మునిగి పోతుండగ తోటి స్నేహితులు కేకలు వేసి కాపాడే యత్నం చేశారు. గుంత లోతుగా ఉండడంతో యువకుడు ఊపిరి ఆడక మృతి చెందాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పగిడ్యాల్ చెరువులో..

గండీడ్, ఫిబ్రవరి 11 : గండీడ్ మండలంలోని పగిడ్యాల్‌లో ఓ మహిళ మంగళవారం చెరువులో శవమై తెలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పగిడ్యాల్ గ్రామానికి చెందిన చెంచు పద్మమ్మ (35) గత ఆదివారం ఇంటి నుంచి బయలు దేరి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు అన్ని చోట్లు వెదికినా ఎక్కడ ఆమె ఆచూకీ లభించలేదు. మంగళవారం చెరువులో శవమై తేలడంతో గుర్తించిన గ్రామస్తులు, కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మహిళ శవాన్ని చెరువులో నుంచి బయటి తీయించి పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

జడ్చర్లలో వ్యక్తి మృతి

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి 11 : మండలంలోని బండమీదిపల్లి గ్రామానికి చెందిన చీకూరి శంకర్ (33) కూలి పని కోసం వెళ్తు ప్రమాదవశాత్తు జారీ పడి మృతిచెందాడు. మంగళవారం జడ్చర్లలోని నేతాజీ చౌరస్తా సమీపంలోని ఓ వీధిలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతుడు బండమీదిపల్లికి చెందిన చీకూరి శంకర్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జడ్చర్ల మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌లు ఢీకొని..

ఊట్కూర్, ఫిబ్రవరి 11: ద్విచక్ర వాహనాలు ఎదురుపడి ఢీ కొట్టుకోగా ఐదుగురు తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం మండలంలోని కొల్లూరు స్టేజీ సమీపంలో చోటుచేసుకున్నది. ఎస్సై కృష్ణంరాజు కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన గొల్ల కిష్టప్ప, రఘువీర్ బైకుపై మక్తల్‌కు వెళ్తున్నారు. పెద్దపొర్లకు చెందిన రవి, అంజిలప్ప, నాగమ్మ మరో బైక్‌పై ఎదురుగా వస్తున్నారు. కొల్లూరు స్టేజీ సమీపంలో రెండు బైకులు ఢీకొట్టుకోగా.. మహిళతోపాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు మహబూబ్‌నగర్ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబాలకు
మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే ఆల

మూసాపేట/పాలమూరు, ఫిబ్రవరి 11 : మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని గాజులపేటకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బంగారు పెద్ద వెంకటయ్య భార్య బాలమణెమ్మ(60) సోమవారం మృతి చెందారు. విషయం తెలిసి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం గాజులపేటకు వెళ్లి బాలమణెమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని చిన్నదర్పల్లి భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు రమేశ్‌నాయక్ మాతృమూర్తి అంజమ్మ పార్థీవ దేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారివెంట మున్సిపల్ మాజీ చైర్మన్ కేసీ నర్సింహులు, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ గణేశ్ ఉన్నారు.

జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి బదిలీ

• రాత్రికి రాత్రి చార్జి తీసుకున్న నూతన సీఐ కమలాకర్

ఎస్పీ జానకిని కలిసిన జడ్చర్ల టౌన్ నూతన సీఐ కమలాకర్

మహబూబ్‌నగర్/జడ్చర్ల, ఫిబ్రవరి 11: మహబూబ్‌నగర్ పోలీసు అధికారుల ఆకస్మిక బదిలీలు జరుగుతుండడంతో చర్చనీయా అంశంగా మారింది. సోమవారం వరకు విధుల్లో ఉన్న జడ్చర్ల సీఐ ఆదిరెడ్డికే తెలియకుండా ఆయన బదిలీ జీవోను రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు జారీ చేశారు. సోమవారం రాత్రే నూతన సీఐ కమలాకర్ జడ్చర్ల పోలీసు స్టేషన్‌కు వెళ్లి చార్జి తీసుకోవడంతో విధుల్లో ఉన్న సీఐ ఆదిరెడ్డి సైతం ఆశ్చర్యానికి గురైనట్లు తెలిసింది. జడ్చర్లలో వివాదారహితుడిగా అందరితో కలుపుకుపోవడంతోపాటు శాంతిభద్రతల పరిరక్షణలో కూడా మెరుగ్గా పనిచేసే సీఐపై బదిలీ వేటు పడడం ఎమిటని జడ్చర్ల ప్రజలు అనుకుంటున్నారు. ఇటీవల బాలనగర్ ఎస్సై తిరుపాజీని ఆకస్మీకంగా బదిలీ చేశారు. అయితే ఉమ్మడి జిల్లాకు చెందిన కమలాకర్ 2009లో ఎస్సైగా విధుల్లో చేరారు. ఆయన సొంత ఊరు వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం తిప్పడంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. జడ్చర్ల టౌన్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా చార్జ్ తీసుకున్న అనంతరం జిల్లా ఎస్పీ జానకిని మర్యాద పూర్వకంగా సీఐ కమలాకర్ కలిసి పూలమొక్క అందజేశారు. మల్టీజోన్ ఐజీ కార్యాలయం నుంచి వెయిటింగ్‌లో నుంచి రావడం జరిగింది. ఆయన గతంలో ఎస్సైగా సదాశివ్‌పేట, గజ్వేల్, కమిటీ, మునిపల్లిలో మెదక్ జిల్లాలో ఎస్సైగా చేసి, సీసీఎస్ సీఐ నాగర్‌కర్నూల్, తొగుట్ట సీఐ సిద్దిపేట జిల్లాలో విధులు నిర్వహించారు.

ఎంపీటీసీ పోలింగ్ స్టేషన్ల జాబితా విడుదల

పోలింగ్‌స్టేషన్ల తుది జాబితాను విడుదల చేస్తున్న అధికారులు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 11 : మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను మండల పరిషత్ అధికారులు మంగళవారం విడుదల చేశారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ గోవింద్‌రెడ్డి, వారి సిబ్బంది పోలింగ్ స్టేషన్ల తుది జాబితాకు సంబంధించిన ప్రతులను మండల పరిషత్ కార్యాలయ నోటీస్‌బోర్డుపై ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈనెల 13వ తేదీలోగా మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని గోవింద్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నరేశ్, బుచ్చన్న పాల్గొన్నారు.

49పోలింగ్ కేంద్రాలు

భూత్పూర్, ఫిబ్రవరి 11 : త్వరలో జరిగే స్థానిక ఎన్నికల కోసం మండల వ్యాప్తంగా 49పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ప్రభాకర్‌చారి తెలిపారు. మండలంలోని 19గ్రామ పంచాయతీలు, పది ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. తుది ఓటరు జాబితా ఈనెల 15వ తేదీన ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీదేవి, సీనియర్ అసిస్టెంట్ రెహమాన్, జూనియర్ అసిస్టెంట్ బాలరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

నారాయణపేట, ఫిబ్రవరి 11: లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు సత్వర న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీమార్గంతో తమ కేసులు పరిష్కరించుకునేలా కృషి చేయాలని పోలీసులకు సూచించారు. పెండింగ్ కేసులు త్వరతిగతిన పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. మొత్తం 6,540 కేసులు పరిష్కరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. డీఎస్పీ లింగయ్య మాట్లాడుతూ న్యాయమూర్తి ఇచ్చిన టార్గెట్‌లో 80నుంచి 95శాతం రాజీమార్గంతో పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వింధ్యానాయక్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ ఉమర్, అడిషనల్ జూనియర్ జడ్జి సయ్యద్ జకియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన



పనులను పర్యవేక్షిస్తున్న నాయకులు

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి 11 : షబ్–ఏ–బరాత్ పండుగ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులోని ముస్లింల శ్మశాన వాటికలో ముందస్తుగా పారిశుధ్య పనులను చేపట్టారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కౌన్సిలర్ సాజిదా ఇఫ్తేకార్ పర్యవేక్షణలో శ్మశానవాటికలో పారిశుధ్య పనులను చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇఫ్తేకారొద్దీన్, నర్సింహులు, అజహార్, మొఖీద్, శ్రీను, నవాజ్ ఉన్నారు.